## తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, గూగుల్ క్లౌడ్ మధ్య కీలక ఒప్పందం

- మొదటి పేజీ తరువాయి

తెలంగాణ పోలీసు శాఖ సైబర్ రక్షణ సామర్థ్యాలు గణనీయంగా మెరుగుపడతాయని అధికారులు భావిస్తున్నారు. గూగుల్ క్లౌడ్ సహకారంతో సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను 24 గంటలూ పర్యవేక్షించేందుకు వీలు కలుగుతుంది. అంతేకాకుండా, పోలీసు శాఖకు సంబంధించిన ఐటీ మౌలిక సదుపాయాలను నిరంతరం కనిపెట్టుకుని ఉండటం ద్వారా ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలనైనా తక్షణమే గుర్తించి, తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇది సైబర్ బెదిరింపులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి దోహదపడుతుంది. ఈ అవగాహన ఒప్పందం మూడేళ్ల కాలవ్యవధి కలిగి ఉంటుందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్ వెల్లడించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- మొదటి పేజీ తరువాయి

విద్యార్థులు అటు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోలేక, ఇటు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి" అని సంజయ్ లేఖలో పేర్కొన్నారు.

## లైసెన్స్‌డ్ సర్వే అభ్యర్థులకు రేపటి నుంచి దరఖాస్తులు

- మొదటి పేజీ తరువాయి

అధికారులు చర్యలు తీసుకోవాలి. మండలాల్లో భూలావాదేవీలు, భూ విస్తీర్ణాన్ని బట్టి సర్వేయర్లను నియమించాలి. కర్ణాటకలో 20 ఏళ్ల క్రితం నియమితులైన సర్వేయర్లు కొనసాగుతూనే ఉన్నారు. రాష్ట్రంలో కూడా అదే విధానాన్ని అవలంబించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి" అని మంత్రి వివరించారు.

## వైఎస్ రెడ్డి ఇంట్లో ఈడీ రైడ్స్: రూ.9 కోట్ల నోట్ల కట్టలు, బంగారం సీజ్

ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్.. ED దాడుల్లో పెద్ద చేప చిక్కింది. ఇంట్లో సోదాలు చేస్తే మైండ్ బ్లాంక్ అయ్యింది. ఏకంగా 9 కోట్ల రూపాయల నోట్ల కట్టలు గుట్టలుగా ఇంట్లో పట్టుబడ్డాయి. అంతేనా.. మరో 10 కోట్ల రూపాయల విలువైన బంగారం సీజ్ చేశారు అధికారులు. ఇంతకీ ఎవరీ వై.ఎస్.రెడ్డి.. ఇతను ఏం చేస్తుంటాడు.. ఈడీ దాడి వెనక ఉన్న కారణాలు ఏంటో తెలుసుకుందాం..

హైదరాబాద్?కు చెందిన వైఎస్ రెడ్డి ముంబైలో టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్?గా పని చేస్తున్నాడు. అయితే.. బిల్డర్స్?తో కుమ్మక్కై 41 భవనాలకు ఆయన అనధికారికంగా అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు వైఎస్ రెడ్డిపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా గురువారం (మే 15) అతడి ఇంట్లో సోదాలు నిర్వహించింది.ఏకకాలంలో ముంబై, హైదరాబాద్?తో పాటు 12 చోట్ల ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సోదాల్లో 9 కోట్ల రూపాయలకు పైగా నగదు, 23 కోట్ల రూపాయల విలువచేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నోట్ల కట్టలు, నగల గుట్టలు చూసి అధికారులు ఆశ్చర్యపోయినట్లు సమాచారం. కోట్ల విలువైన డాక్యుమెంట్లను కూడా అధికారులు గుర్తించినట్లు తెలిసింది. కాగా, ఈ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి: తుమ్మల



హైదరాబాద్ పెన్ పవర్: ఏపీలోని చింతలపూడి నుంచి ఖమ్మంలోని ధంసలాపురం వరకు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులను తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. గురువారం ఆయన సుమారు 100 కి.మీ. మేర ప్రయాణించి రహదారి నిర్మాణ పనుల గురించి ఎన్‌హెచ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కింద చేపట్టిన అండర్‌పాస్‌లు, వంతెనలు తదితర ప్రక్కర్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎన్‌హెచ్ఏఐ పీడీ దివ్య తదితరులు ఉన్నారు. ఖమ్మం జిల్లా ఖమ్మం గ్రామీణం మండలం తల్లంపాడు నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులను తెలంగాణలో మూడు ప్యాకేజీలుగా, ఏపీలో రెండు ప్యాకేజీలుగా విభజించారు. తెలుగు రాష్ట్రాల్లో ఐదు ప్యాకేజీల కింద 117 అండర్‌పాస్‌లు, 33 కల్వర్టులు, 9 భారీ వంతెనలతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఖమ్మం మీదుగా రాజమహేంద్రవరం, విశాఖపట్నం మధ్య జరిగే రవాణాను ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే మరింత సులభతరం చేయనుంది.

# సున్నా సుంకాలపై రగడ.. ట్రంప్ ప్రకటనను ఖండించిన ఇండియా



హైదరాబాద్ పెన్ పవర్:గతనెల అమెరికా అధ్యక్షుడు ప్రపంచ దేశాలపై భారీగా సుంకాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత చాలా దేశాలపై వాటిని తాత్కాలికంగా నిలిపివేసిన ట్రంప్ ప్రస్తుతం ఒక్కో దేశంతో ట్రేడ్ డీల్స్ కుదుర్చుకుంటున్నారు. ఇప్పటికే చైనాతో డీల్ ముగియగా.. భారతదేశ బృందం కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలో అమెరికా అధికారులతో చర్చలు మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఖతార్ దోహాలో పర్యటనలో ఉన్న ట్రంప్ కీలక కామెంట్స్ చేశారు. అమెరికాతో జీరో టారిఫ్స్ వాణిజ్యానికి భారత్ అంగీకరించిందని ప్రకటించారు. దీనికి సంబంధించి ఒప్పందానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించటం భారతీయ స్టాక్ మార్కెట్లలో నిద్రపోతున్న బుల్స్‌ని తట్టి లేపింది. దీంతో అమెరికా వస్తువులపై ఎలాంటి సుంకాలు ఉండబోవని ట్రంప్ ప్రకటించారు. భారతదేశంలో అమెరికా ఉత్పత్తులను విక్రయించటం చాలా కష్టతరంగా మారిందని అయితే ప్రస్తుతం జీరో టారిఫ్స్ డీల్ అమెరికా వ్యాపార సంస్థలకు వ్యాపార అవకాశాలు దక్కుతాయని పేర్కొన్నారు. దీనికి ముందు గత నెలలో ట్రంప్ భారతదేశంపై 26 శాతం రెసిప్రోకల్ టారిఫ్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తర్వాత వాటిని తాత్కాలికంగా నిలుపుదలలో ఉంచినప్పటికీ బేసిక్ టారిఫ్ 10 శాతం సుంకాలు అమలులో ఉన్న సంగతి తెలిసిందే. అమెరికా భారత స్టీల్, అల్యూమినియంపై సుంకాలను ప్రకటించటంతో ఆగ్రహంగా ఉన్న ఇండియా ప్రపంచ వాణిజ్య సంస్థ దగ్గరకు విషయాన్ని తీసుకెళ్లటంతో పాటు మరిన్ని అమెరికా వస్తువులపై సుంకాలను పెంచాలని కూడా ఆలోచనలో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన జీరో టారిఫ్స్ ట్రేడ్ డీల్ పై భారత వర్గాలు స్పందించాయి. ప్రస్తుతానికి వాణిజ్య ఒప్పందం ఇంకా కొలిక్కి రాలేదని, ఇది ఇప్పటికీ చర్చల దశలోనే ఉన్నట్లు సీఎన్ఎన్ న్యూస్ 18 నివేదించింది. అలాగే భారత్ బియ్యం, పప్పుధాన్యాల విషయంలో చర్చలకు అంగీకరించలేదని కూడా తెలుస్తోంది. అయితే భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కీలక చర్చలు జరపనున్నట్లు సమాచారం. మొత్తానికి ట్రంప్ కొంత అత్యుత్సాహం ప్రదర్శించారనే కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ ఇండియా, పాక్ అధికారిక ప్రకటనకు మునుపే ట్రంప్ ట్వీట్ చేసి యుద్ధాన్ని ఆపినట్లు క్లెయిమ్ చేశారు. ఆ తర్వాత కాశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తానని చెప్పగా భారత్ తోసిపుచ్చింది. అలాగే యుద్ధం సమయంలో అమెరికా ఆయుధాలు లేదా సహాయాన్ని భారత్ కోరకపోవటం వంటి అంశాలు పెద్దన్న పాత్రలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కి కొంత మింగుపడు పడటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కక్షతోనే ఐఫోన్ల తయారీని ఇండియా నుంచి దూరం చేయాలని చూస్తున్నట్లు ట్రంప్ దోహా కామెంట్స్ నుంచి విశ్లేషకులు అర్థమౌతోందంటున్నారు.

